కన్నీటి తొలకరి

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు B. A.

(గతసంచిక తరువాయి)

ఈ మహావీరుడు చిరస్మరణీయుడు. మనం పూజించినా – పూజించకపోయినా ఆ ప్రతాపసింహుని పేరును అన్నియుగాలలోను ప్రజలు స్మరించి – పూజించే తాహత్తు ఆత్యాగంతోవుంది. ఎలాగ ఆ వీరుని ఋణం మనం తీర్చుకుంటే బావుంటుందో ఆలోచించండి.

ఎదురుచూచే ఆ ప్రజల్ని - విజయోత్సాహంతో విసుగులేకుండా జేజేలు చెప్పుతూ వీరప్రతాపసింహుని దర్శనభాగ్యంకోసం తహ తహ లాడే ప్రజల్ని – యీ విషాధగాధని విని నిలువునా నీరయిపోయే ఆ ప్రజల్ని – ఆవేశం తగ్గించుకోమని ప్రాధేయపడదాం! కర్తవ్యం యేమిటో తెల్చుమని కోరదాం. నడవండి – వీరులారా నడవండి – ప్రతాపసింహుని కీర్తనీయ చరిత్రను పదాలతో పాడుతూ నడవండి – ఆమహానీయుని ఆత్మశాంతికి ఆ పర్మేశ్వరుని నుతిస్తూ - స్తుతిస్తూ ముందుకునడవండి – విచారసూచకంగా జెండాలు సగంవంచి సాగండి... యిలాగ వీరావేశంగా మాట్లాడింది ఎవరో ఎరుగుదురా? అదుగో అమరసేనుడు, ప్రతాపసింహుని కుడిభుజం.

విన్నారు - అక్కడి వారంతా నెత్తురును వేడిక్కించి నరాలని కుతకుతవుడికించే ఆ మహోపన్యాసాన్ని. ఒక్కొక్కమాట - అమరసేనుడు నోటినుంచి వినిపించేసరికి ప్రజలు వొళ్లు తెలియకుండా వున్నారు. త్యాగమూర్తి ఆ వీరప్రతాపుని ఆకస్మిక మరణానికి తల్లడిల్లిపోయారు. ఆ వీరుని చేతులారా చింపిన పిశాచి వీరబాహుణ్ణి ఆమాంతంగా కాల్చి మార్చాలని వుడుకుతున్నారు. ప్రజలకోసం ప్రాణాలర్పించిన – ఆ ప్రతాపసింహుని మృతకళేబరం యింకా చిరునవ్వులు నవ్వుతూన్నట్టే - వారికేదో అమరసందేశం యిస్తూన్నట్టుగానే భావించినారేమో మరి - విప్లవానికి - ఉద్రేకానికి – అనంతావేశానికి హద్దుల్లోనేవున్నారు. ఎంత హద్దుల్లోవుంచుదామన్నా – ఆ ప్రజాసమూహంలోంచే – చింతనిప్పుల వంటి కళ్లతో – తళతళ మెరిసేకత్తితో – చల్లారని పగతో - ఆపినా ఆగని తొందర పాటుతో - తరతరా ఒకయువకుడు పళ్లు పటపట కొరుకుతూ వుద్రేకంగా బయలుదేరివస్తున్నాడు. ఆపేవారిని అటకాయించి–అడ్డువచ్చేవారికి కత్తి చూపుతున్నాడాతడు ఎవరీతడు? ఏమిటీ ఉద్రేకం? ఎవరిని ఏంచేస్తాడో? ఆపినా ఆగడే! పరాసరి వీరభాహుని దగ్గరకు పోగూడదు. ఏరా! పిరికిపందా? హూఁ అని గర్జించాడు. అన్నింటికీ తెగించిన వీరబాహుడు - బ్రతుకు మీద నిరాశచేసుకొనేవున్నాడు. ఆ యువకుడు వీరబాహుని జుట్టుపట్టుకొని అటూ యిటూ వూపివేశాడు. ఇలాంటి జగడాలు అతడిజీవితంలో ఎన్నో? వందలా – వేలా? అన్నట్టుంటాయి. చింత చచ్చినా పులుపుచావదన్నట్లు ఆ రౌడీరాజా – ఆయువకుణ్ణి ముప్పతిప్పలూ పెట్టినంతపనిచేశాడు. వాళ్లిద్దరికీ జరుగుతూన్న సంఘర్షణను చివరదాక చిత్రంగాచూస్తున్నారు అక్కడివారు. ఇంకెక్కడి వక్కజిత్తులురా అని ఆ యువకుడు తోకతొక్కిన కోడెతాచులాగ– కత్తిదూచి – కోపంతో ఆచోరనాయకుని గుండెల్లో గుచ్చాడు. కత్తి పోటు తగిలిందే తడవుగా ఆ ఆ దొంగలధోర కుంగిపోయాడు. ఆఁ అబ్బా! అంటూ నేలకూలి - గుండెల్లో దూరిన కత్తిని పట్టుకొని బాధను కప్పిపుచ్చుకొని నవ్వునటిస్తూ ఆమృత్యుఘడియలలో – ఆ ఎగవూపిరితోనే - హాయ్! హాయ్! అన్నాడు.

పరివారమంతా భస్మంకాగా - దోపిడీధనం దొరలపాలుకాగా–కొనవూపిరితో బాధపడుతూ - మరోక్షణంలోనే మృత్యుదేవత కబురు కోరలకు కానుకగానున్న ఆ అభాగ్యుడలా నవ్వుతాడేమిటి! అని కొందరు విస్తుపోయారు. ఎవరికేంతెలుసు ఆ అవసానదశలో అతని ఆగిపోయేగుండె యే ఆనంధాన్ని అతనికి జ్ఞాపకంచేసి అలా నవ్వించిందో? లేకపోతే కత్తిపోటుతో గుండెలోంచి రక్తం వరదలు కట్టి ప్రవహిస్తూంటే – ఆ విషాదమరణానికి విచారించే వాళ్లెవరని తెలిసికొని – శత్రువుల మధ్య దారుణమరణానికి ఆహుతి అయిన అంతటి చోర

నాయకుడు — ఈ ప్రపంచభోగాలు యింతేనని నవ్వుకున్నాడా? హింసను ఆదరిస్తే హింసామరణమే వచ్చిందని గ్రహించి-సరిపెట్టుకుని నవ్వుకున్నాడా? ఎందరు ఎన్ని జీవననాటకాలలో ఎన్ని పాత్రలు ఎలా నిర్వహించినా — చివరికి అంతా యింతేననే వేదాంతం తెచ్చుకొని తెలుసుకొని — బ్రతుకురహస్యానికి ఫక్కున నవ్వుకున్నాడా? ... ఎందుకు నవ్వాడు యీ విపరీత విపత్కర సమయంలో? యిలాగే అంతా ఒకరిముఖాలవైపు మరొకరు చూసుకుని — చూపులతోనే ఆశ్చర్యాన్ని ప్రకటించుకుంటున్నారు.

వచ్చేప్రాణం పోయే ప్రాణం — ఎగవూపిరి — ఇంతటి మరణచిహ్నాలు అతణ్ణికూల్చి — క్రుంగదీస్తున్నా — అతడు గిలగిల తన్నుకుంటున్నా — యింకా నవ్వుతూనేవున్నాడు కొంచం కొంచంగా. ఆ కొంచం నవ్వులో గొణుగుడు మాటలు ఏవో!

ఎంతగట్టి పిండంరా వీడు! అంతటి కత్తిపోటుకి తట్టుకొని యింకా చావనేలేదే — మరోమనిషైతే ఆనెత్తురు చూసే గుండె ఆగి చచ్చేవాడు. బెదురు లేనితత్వం. భయంలేనిరక్తం. పోషకివున్న దేహం. ఆకండలు — ఇనపతీగెల్లాంటి నరాలు — ఉక్కుతుండులాంటి మనిషి. చీకూ చింతా లేకుండా బ్రతికిన వాళ్లు — అంతచప్పున చావలేదు. ఈ కలికాలంలో కిలకిలానవ్వుతూండే వాళ్లు రోగాలకు దూరంగా వుంటారు. వాడూ — వాడి బ్రతికిన తీరూ యేచక్రవర్తికివుంది? అని కొందరు అనుకుంటూండగానే మరికొందరు వాడిమాటలేవిటో విందాం అని నిశ్శబ్దంగా వుండి ఆ చచ్చిపోతూన్న వీరబాహుని గొణుగుడు మాటల్ని చెవులొగ్గి వింటున్నారు.

వీరబాహుని ముఖాన చావుకళే లేదు! ఏదో ఘన కార్యం సాధించినట్టుగా వికసించివుంది— ఆ నవ్వుముఖం ఆ నవ్వుల మధ్య బాధ — బాధల మధ్యనవ్వు — ఈ పరిస్థితిలోనే కొనవూపిరి — ఆ వూపిరిని బిగబట్టి — ఉత్సాహంతో, ఉద్రేకంతో, అతడు యిలా యింకా గొణుక్కుంటున్నాడు.

నా జీవితాశయాన్ని సాధించాను. మా జాతిని చిత్రవధ జేసి, మాఖజానాను నిలువునాదోచుకొని— మా జీవాలను ఉసురుపెట్టిన ఆ దొంగలకన్నా దొంగ-మాయప్రతాపుని ప్రాణాలు తీసిన పేరునాకే దక్కింది. ఆ వార్తవిని స్వర్గీయులైన నా అనుచరులు ఎంతో సంతోషిస్తారు — హాయిగా తియ్యని పగ తీర్చుకొని చస్తున్నా! మరే బెంగాలేక — అంటూ గొణుక్కొని చివరకు విగతజీవుడయ్యాడు ఆ వీర బాహుడు, కలికాల కర్ణుడు చచ్చాడన్నారు అందరూ. చచ్చినవాడిని చేరదీసికళ్లతో చూచారు. శవాన్ని కదిపారు. బ్రతికివుండగా వాడిదగ్గరకేపోలేనివాళ్లు ధైర్యంగా శవాన్ని చూడలేకపోయారు పాతబెదురుతో. నిజంగా చచ్చాడో — లేక చావు నటిస్తున్నాడో తిన్నగా చూడండని కొంతమంది పిరికి పెద్దలు హెచ్చరిస్తూంటే — యింకేముంది. ఇది జీవంలేనికంకాళం — చిలక ఎగిరిన పంజరం. అంటూ అందరూ ఆశవంమీదనుంచే పోయారు — పగతో — బాధతో చెరిసగం సంతృప్తితో — వీరప్రతాపుడు లేడే — మరిరాడే — మనకోసం ప్రాణదానం చేశాడే — అనేవిశ్వాసంతో.

ఏ రాహుకాలంలో ఆరంభించబడిందో యీ వూరేగింపు! రెండు నిండు ప్రాణాల్ని బలితీసుకొని రుచిమూచింది.

మెల్లిగా పాకింది పాడువార్త. అపజయ వార్తలు — ఆకస్మిక ప్రమాదాల వార్తలు - మరణ వార్తలు; ఇటువంటి తరహాకుచెందిన వట్టి అశుభ వార్తలు వాయువేగ — మనోవేగాలతో ప్రయాణం చేస్తాయి.

ఎదురు చూస్తున్న వారందరూ — యీ విషాద వార్తవిని తెల్లబోయారు. ఇది నిజమా? అని కొందరు నమ్మలేకపోతున్నారు. మరికొంతమంది గుండెబల హీనతగలవాళ్ళు ఈ వింతవిచారవార్తను విన్నదే తడవుగా మూర్ఛవచ్చినట్లు పడిపోయారు. అందరి ముఖాలలోనూ ఆశ్చర్యమూ — విచారమూ తాండవిస్తున్నాయి. దేవుడా! ఆ మంగళమూర్తికే చావు పెట్టాలా — మా ఆనందాన్ని చూడలేవా — మా కళ్లు అంత పాపిష్టివా? అంటూ ఆవేదనా — రోదనా ఆవరించాయి ఆ ప్రజసమూహాన్ని!!

క్షణం మనది కాదని కొందరు—బ్రతుకు బుద్బుధప్రాయమండీ అని మరికొందరు. అవతార పురుషులు ఘనకార్యాలు చేసి చప్పున దివంగతులవుతారండీ. యిదికొత్తకనకనా పుణ్యపురుషులకి అని యింకా కొందరు వ్యాఖ్యానించారు.

అయ్యో! ఆ సుశీలాదేవికి ఎంతకష్టం వచ్చింది. పడుచు తనంతోనే పసుపూ - కుంకుమ కట్టైపోయాయే! చిన్నారిచిట్టిబాబు తండ్రిలేనివా

దయ్యాడే! అని ఆ వూరివారంతా చింతాక్రాంత చిత్తులై సుశీలా దేవిని ఓదార్చడానికని గుంపులు గుంపులుగా పోతున్నారు.

పూలదండలు వాడిపోయాయి, మంగళహారతుల పళ్లాలు చేతుల్లోంచి జారిపోయాయి. అందరి కళ్లూ విచారంతో నీటిమయమయ్యాయి. ఒక్క ప్రాణి కోసం అలా అందరూ దుఃఖిస్తున్నారు. ఇది అందరికీ విపత్తుగానే పరిగణింపబడింది. అంచేత ఎవర్నీ ఎవరూ ఓదార్చుకోవడంలేదు.

కాలం చేసే గారడీ యింతా - అంతానా! క్షణం మనదికాదుకదా. కొన్ని ఘడియలక్రితం సుశీల సుమంగళి. పసుపు కుంకుమలకు లోపంలేని యిల్లాలు. నల్లపూసలదండ తెగిపోని నారీమణి. వీరప్రతాపుని వీరపత్ని, పురజనుల జోహార్లతో మురిసిపోయిన మగువ. అందరి దృష్టిలోనూ ఆమె ఎంతో అదృష్టవంతురాలు.

ఇప్పుడో! కాలచక్రం తిరిగింది. ఆవిడ అదృష్ట చక్రం వక్రంగా తిరిగింది. పతివియోగవిచారం ఎదురయింది. తనమాంగల్యశోభ మటుమాయమై పోయింది. నల్లపూసలదండ తెగిపోయింది. అందరి దృష్టిలోనూ ఆవిడ యిప్పుడు ఎంతో దురదృష్టవంతురాయి.

ఏపాపం యెరగని — ఏమాయా మర్మం యెరగని ఆ పసిపాప బాలచంద్రుడు తండ్రిగండాన పుట్టాడేమో — లేకపోతే యింతటి దుర్మరణమా! అని కొందరు అనుకున్నారు.

మహాపర్వదినాన — మంచితిథి నారనక్షత్రాలతో మనుగడ చాలించిన ఆ మహనీయుడు చరితార్థుడన్నారు — పంచాంగాలు తిరగవేస్తూన్న పురోహితులు.

వీరావేశంతో — ప్రతాపసింహుని కీర్తిస్తూ — అతని సాహసచరిత్రను పదం పాడుతూ వీరకదం తొక్కుతూ — వూరేగింపు వూళ్ళోకి వచ్చింది. దేవుడువూరేగింపులోవస్తే ఎంత భక్తిశ్రద్ధలు చూపుతారో - ప్రజలు అలాంటి భక్తిశ్రద్ధల్నే ఆ యోధునిపట్ల చూపించారు. బాష్పకణాలునిండిన కళ్ళతో — పూలవానలుకురిపించారు. జే జే లు చెప్పారు. చేయెత్తినమస్కరించారు. వినయంగా కళ్లుమూసుకొని అంజలించి ఆత్మశాంతికై — భగవంతుని ప్రార్థించారు. ఆ వూరేగింపు సాగడం ఎంతో కష్టంగావుంది.

మారుమూలలలో మూలుగుతున్న ముసలివాళ్ళు కూడా—వొణుకుతూ కర్రపుచ్చుకొని, ఏడి నాయనా- ఆ పుణ్యాత్ముడు! అంటూ ఆ జనాన్ని తోసుకొని- అగుపించీ అగుపించని చూపులో ఆ మంగళ విగ్రహాన్ని చూసి — ఎంత దర్జాపురుషుడవురా బాబూ! అప్పుడే నూరేళ్ళూ నిండాయా నీకు! మాలాంటి వాళ్ళు యీ మట్టిమీదా! నీలాంటివాళ్ళు అప్పుడే స్వర్గంలోనేనా! పాడు రోజులు! పాడు రోజులు!! అని ఆ వయసుమీరినవాళ్ళు వాపోయారు.

చూడండి - ఆ చిరునవ్వుల ఠీవి! ఇంకా ప్రాణం వున్నట్టుందే కాని — చచ్చిపోయినట్టున్నాడు టండీ మహానుభావుడు! అహఁ చంటిపిల్లలుకూడా దడుసుకోవటంలేదండీ! ఎంతటి మంగళ విగ్రహం! సాటి మానవ సమాజ సౌఖ్యంకోసం — సాహసించి, యిలా త్యాగంచేసిన ఆ అమృత స్వరూపానికి మృత్యువే లేదన్నారు — చూస్తున్నవారు, కన్నీటిధారలతో — కైమోడ్పులతో ఆ ప్రజలంతా ఆ మృతకళేబరాన్ని దేవతా విగ్రహంలాగ అర్చిస్తున్నారు. వీరబాహుడే నీ పాలిటి యమకింకరుడా! శాంతి దూతవు అప్పుడే కన్నుమూశావా! కన్న తండ్రీ అంటూ బిక్కమొహాలువేసి భోరుమని దుఃఖం ఆపుకోలేనివారు చిన్నపిల్లల్లాగ కటకటపడ్డారు. ఈ కీర్తిమూర్తి ఋణం యెన్ని జన్మలకైనా మనం తీర్చుకోగలమా! అని గాఢవిచారాన్ని వెలిబుచ్చారు. మన కష్టాలు తనవే అనుకొని యింత త్యాగంచేసి యిలా సుఖశాంతుల్ని సమృద్ధిగా చూపించి మన సుఖాలలో తనకు సుఖాపేక్ష లేనట్టు కన్నుమూశాడే యీ గణ్యాత్ముడనుకొన్నారు.

ఇలాంటి విచార సూచక భాషణలతోనే ఆ వూరేగింపు ప్రతాపసింహుని ఇంటిముందు ఆగింది. తీర్థప్రజలాగ వున్నాడు జనం. దీనంగా చూసేవారూ- తెల్లబోయి చూసేవారూ — అయ్యో! అని అటమటించేవారు — యెంతో పండుగ అనుకున్నాం — మా పండుగ యిలా బ్రద్దలయిందే బ్రహ్మదేవుడా! అనుకుంటూ కుమిలిపోయేవారూ! యీ దృశ్యాన్ని చూడలేక సొక్కిపోలేవారూ! సుశీలను పట్టుకొనేవారు! బాలచంద్రుణ్ణి ఎత్తుకొనేవారు! ఏమీ తోచక గిజగిజలాడేవారూ ... యిలాగ వున్నారందరూ — అక్కడ.

ఏనుగుమీదవున్న ఆ ప్రతాపసింహుని దేహాన్ని — బంగారు జలతారు శాలువాతో కప్పబడివున్న ఆ

దేహాన్ని విచార ముద్రలతో దింపారు. పట్టుపరుపు పరిచిన ఆ ఎత్తరుగుమీద వుంచారు. కంఠంలోంచి దూరిన బాకు — గాయం — వీరబాహుని దారుణ కృత్యం ! అంతా చూశారు. అమరసేనుడు — చిన్న వాడిలాగ ఆ శవంమీదపడి ఏడ్చినాడు.

ఇంత దారుణహత్య చేసినవాడు మాత్రం పుట్టి కట్టుకొని పుయ్యాల వూగడా ! వాడూ బల వంతంగా చావలేదూ ! హింసకి — హింస యివ్వడు టండీ ఆ దేవుడు ! అనుకుంటున్నారు మరికొందరు.

అంతా యింత బాధపడుతున్నారు. సుశీలాదేవి-గతించిన భర్తవైపు అలాగే చూస్తూ నిలబడివుంది. ముద్దుబిడ్డ పక్కనేవున్నాడు. చంటిపిల్లవాడికి మాయా తెలియదు, మర్మం తెలియదు. కష్టం తెలియదు. సుఖం తెలియదు. అతని దృష్టిలో అమృతం-విషమూ అనే భేదంలేదు, ఏడిపించినా—పగలేకుండా ఏడుస్తాడు. ఏడిపించనివాళ్ళతో నవ్వుతాడు. అలాంటి సమతాభిమానికి యీ లోకంలోవుండే బ్రతుకు మర్మాలు - జనన మరణాలు—ఆపదలు సంపదలు యేమీ తెలియవు. తన తండ్రి అలాగ విషాద మరణానికి బలిఅయిపోయాడని ఆ పసిబిడ్డకేం తెలుసు? పడుకున్నాడు నాన్న — లేచివస్తాడు — లేచి నన్ను ముద్దాడుతాడు అనుకుంటున్నాడేమో—మూగభాషకి టిప్పణి ఎవరు చెప్పగలరు ! అంతటి అలజడిలోనూ ఏ బాధా ప్రకటించనివాడు ఆ బాలచంద్రుడొక్కడే !

ఆ సుశీలాదేవి యింతసేపూ అలాగా నిలబడి వుంది. తదేక దృష్టితో — భర్తవైపు చూస్తూంది. చైతన్యంలేకుండా చూస్తోంది. ఏమనుకొందో ? ఎంతబాధపడిందో ? శిలాప్రతిమలాగ నిలబడింది. కదలకుండా — మెదలకుండా అలాగే నిలబడింది. నల్లపాప కంటిలో నడకనే మానేసింది. విచారం - రక్తాన్ని కవ్వంతో చిలికినట్లు కలిపేసి జీవశక్తిని కబళించేస్తూంది.

చూశారు. అంతా ఆ సుశీలాదేవి వైఖరిని చూశారు. విచిత్రంగావుంది అందరికీ. మాటాలేక మంతీలేక సుశీల అలాగేవుంది. ఇంక అందరిలోనూ ఆతురత పెరిగింది. భర్త చనిపోతే బావురుమని ఏడవదే ! కంటినుండి ఒక్క నీటిబిందువుకూడా రాదే ! ఆవిడకు విచారంలేదా ? మరి రాదా ? లేకపోతే- ఆ విడ అలా నిలబడివుండగానే ప్రాణాలు పోయాయా ? ఏం ? పోతేపోవచ్చు. అదీ సంభవమే. విపరీత విచారం హృదయగతిని ఎందుకు నిరోధించలేదు ? అయితే — అంతపని జరిగిందా ? జరిగితే - ఆ ముద్దుబిడ్డకు తండ్రిలేనిలోటుకు సాయం — తల్లిలేనిలోటుకూడానా ? ఎంతలో ఎంతమార్పు ! ! క్షణం మనదికాదుకదా !

పిలవండి వైద్యుల్ని — అలా చూస్తారేం—తీసుకురండి వైద్యుల్ని అన్నారు అక్కడివారు. ఔను - అది మంచిపని అన్నారు మరికొందరు. ఇలా అనుకుంటూండగానే వైద్యుడు చక్కావచ్చాడు. నాడి పరీక్షించాడు. ఆలోచించి-భూమ్యాకాశాలుచూసి-ప్రాణంవుంది-ఫరవాలేదన్నాడు - ఆ వైద్యుడు.

ప్రతాపసింహుని మరణానికే యింకా తమాయించుకోలేని ఆ ప్రజలకి సుశీలాదేవి బ్రతికివుంది - ఫరవాలేదు - అని వైద్యుడు చెప్పిన మాటలు కొంత తహతహని తగ్గించినయి.

అంతలోనే మళ్ళీ వైద్యుడందుకున్నాడు, ఇక రెండు గంటలలోనైనా యీమె - ఏడవకపోతే గుండె ఆగిపోవడానికి అవకాశంవుంది. చింతాక్రాంతమైన యీ శరీరంలో చైతన్యం అంకురించాలంటే - ఎడారిగావున్న ఆ నయనాలలో కన్నీటితొలకరి చిలకరించాలి అప్పుడే మన తల్లి మనకి దక్కుతుంది అన్నాడు వైద్యుడు.

ఔను ! అతని మాటలూ నిజమే మరి ! చితి నిర్జీవ పదార్థాలను దహనంచేస్తే - చింతసజీవుల్ని సమాధిపాలు చేస్తుంది.

అనవసర సమయాలలో భారంగావుండే కాలం - అవసర సమయంలో చరచరాపోతున్నట్లుంటుంది. ఎంచేతనో మరి ? వైద్యుడు చెప్పిన రెండు గంటల గడువులో - అప్పుడే అరగంట దాటిపోయింది. సుశీలాదేవి స్థితిలో మార్పు రవ్వంతా రాలేదు. ఎలాగ మార్పు తీసుకురావడం ? ఎలాగ కన్నీటిని రప్పించడం ? ఎలాగ చైతన్యం చిందించడం ? ఇదే అందరినీ కలవరపెడుతూన్న గడ్డు సమస్య.

పతి గతించాడనివిని - అంతులేని చింతతో అలా శిలాస్వరూపిణి అయింది. పతిని స్తుతిస్తూ మెప్పులు ఆ విడ చెవిలోపడితే - ఆమెకు తప్పకుండా చైతన్యం వస్తుంది. కన్నీరు చినుకుతుంది. పోడికళ్ళు నీళ్ళతో నిండుతాయి. సుశీల బ్రతుకుతుంది. ఇది మంచి సాధనం అన్నారు.

ఎంత నుతించినా - ఎంత స్తుతించినా - సుశీలా

దేవి అలాగేవుంది. ఇంకేం చెయ్యాలి. మరేంచేస్తే యీ మెలో చైతన్యం అంకురిస్తుంది? పోనీ ఎంతటి వీరపత్నివమ్మా! సుశీలా - ప్రతాపసింహునికి తగిన ఇల్లాలవమ్మా. మీ పవిత్రదంపతులు మా భాగ్యం కొద్దీ - మా పూజాఫలంకొద్దీ – మా గడ్డలో పుట్టారు. దుఃఖంలోంచి సుఖాన్ని ప్రసాదించారు. బ్రతుకు బాటలోవుండే ముళ్ళకంచలన్నింటినీ తీసిపారేశారు. సుశీలా! నీ భర్తకీ కీర్తిరావడానికి మూలకారణం నీవే. చక్కని చుక్కానిగల సంసారనావ యిహ పరసుఖసాధకయానాన్ని సాగిస్తుంది విజయవంతంగా, వీరమాత సుశీల. వీరపత్ని సుశీల, సుశీలకు జై అన్నారు అందరూ అనంతావేశంతో. కాని సుశీల తీరు మాత్రం అలాగేవుంది మార్పులేకుండా? చర చరా మరొక అరగంట దాటిపోయింది.

ఇంక ఏంచెయ్యాలి? ఈ నిండు ప్రాణం యిలా నిలువునా పోవలసినదేనా? అయ్యో! ప్రజా బాంధవుల బ్రతుకులు యిలా దుఃఖాంతాలేనా? త్యాగస్వరూపుల జీవితాలు యింతకష్టభూయిష్టంగా వుండేవేనా?

ఏమవాలి ఆ పసిబాలుడు? తల్లీ - తండ్రీలేని అనాథుడు కావలసిందేనా! ఏ దారీ యీ చీకటి యిదారిలో కనిపించటంలేదే - అంటూ ఖిన్నులై వున్నారు అక్కడి పౌరులందరూ. కాలం కళ్ళెం లేని గుఱ్ఱంలాగ చరచరా పోతూంది.

హఠాత్తుగా ఒక అవ్వ బాలచంద్రుడిని ఎత్తుకొని సుశీల కెదురుగా నిలబడి - సుశీలా దేవీ - యిదుగో నమ్మా - నీ ముద్దుబిడ్డడు బాలచంద్రుడు ఇదుగో నమ్మా! యిలా చూడు! యీ బిడ్డనిచూడు! అంటూ ఆవేశంతో కన్నతల్లికి – కన్న బిడ్డని చూపెట్టింది.

ఎవరిని చూస్తోందో – ఏం ఆలోచిస్తోందో – ఎక్కడవుందో ఆ మనస్సు - సుశీల ఆ ముద్దుబిడ్డవైపు చూడనేలేదు. చైతన్యంలేకుండానేవుంది అలాగే.

ఆ అవ్వ వూరుకుందా, ఏడుపే ఎరగని ఆ బాల చంద్రుణ్ణి బలవంతంగా యేడిపించింది. ఆ పసి బాలుడు గుక్కపట్టి యేడుస్తున్నాడు. ఆ తల్లి ప్రక్కనే ఏడుస్తున్నాడు. కన్నకొడుకు ఏడుపు – కన్నతల్లి చెవుల్లో కంచుకంఠమంటూ ప్రవేశించింది. ఆ ధ్వనిలో ఎంత మాంత్రిక శక్తైనా వుంటుంది. ఒక మంచి ధ్వని కొన్ని రోగాలను కుదురుస్తుంది. ఇంకోరకపు ధ్వని ప్రాణాల్ని తీస్తుంది. ఇలాంటి ధ్వని భేదాలతో ఎన్నో అనుభూతుల్ని ఆర్జించవచ్చు.

కన్నతల్లికి తన కన్నబిడ్డ గొంతుక ఆనమాలే. ఎంతోదూరంనుంచి ఏడుస్తూవున్నా - ఆ బిడ్డ గొంతుకను తల్లి యిట్టే పసికట్టుతుంది. ఎంతపనిలోవున్నా - ఎంతతీరికలేకపోయినా_తల్లి తన బిడ్డఏడుపు సహించ లేదు. అలాగే – బాలచంద్రుడు ఏడుస్తూండగా - కదలికలేని సుశీలాదేవి అప్రయత్నంగా పెదవుల్ని చప్పరించింది. ఇంకొకరు – ఆవిడను అండగా పట్టు కున్నారు. బాలచంద్రుడు కేరుకేరుమని యింకా యేడుస్తున్నాడు. సుశీల కళ్ళు కదిలాయి. అదంతా ఆవిడకి అయోమయంగావుంది.

ఆ అవ్వ – పసిపాపనియేడిపించిన కొద్దీ - సుశీలా దేవిలో చైతన్యం వర్ధమానంగావుంది. తన బిడ్డ ఏడుపును సుశీలాదేవి యింకా గుర్తించిందేమో అప్రయ త్నంగా ఆ మాతృహస్తం బుచ్చిబాబు బుల్లిగడ్డాన్ని మెల్లగా నిమురుతూంది. అవ్వ – సుశీలాదేవికి ఆ ముద్దుబిడ్డను మళ్ళీ చూపింది. అమ్మా - యిదుగో! నీముద్దుబిడ్డ యిదుగో! గుక్కపట్టి యేడుస్తూన్న నీ ముద్దులబిడ్డ యిదుగో! ఎందరున్నా తల్లివంటివా రవుతారా? అందరిలోనూ - తల్లిగుర్తు బిడ్డకీ - బిడ్డ గుర్తు తల్లికీ వుంటుందమ్మా. ఒక్కసారి ఎత్తుకో వమ్మా! గుక్కపట్టేడిచే యీ కొడుకును ఎత్తుకో వమ్మా! అంటూ ఆ అవ్వ ఆ తల్లి ఒడిలో ఆ బిడ్డను ఉంచింది.

అనుభవం చాలా గొప్పది. వయస్సుమీరిన అవ్వ – ఎన్ని పురుళ్లుపోసిందో! ఎన్ని కానుపులు కన్నదో – ఎన్ని పెళ్ళిళ్ళు చేసిందో - ఎంతమంది మనమల్ని మోస్తోందో! కడుపు చలవగల ఆ అవ్వకి తెలుసు - అమృతమయమైన అమ్మ మనస్సు తల్లికి ఏంకావాలి? తన సంతాన క్షేమంకన్న మరేం కావాలి? తన బిడ్డల సుఖశాంతులకోసం కన్న తల్లి ఏత్యాగమయినా చేస్తుంది. అంచేతనే తల్లినిమించిన దేవత లేదన్నారు.

సుశీలాదేవి – కళ్ళారా కన్నకొడుకును! ఆ ఏడ్చేకొడుకును! ఆ తండ్రికి దూరమైపోయిన కొడు కును-తల్లిప్రేమ వినాగతిలేని ఆ కొడుకును చూచింది! బిడ్డా! అని కేకవేసి బావురుమంది. గొణుగుడు గొంతులోంచి రా! బాబూ! రా! అని వినిపిం చింది. వణుకుడు చెయ్యిని చాచింది! అయ్యో అంది అందరి ముఖాలనూ తేరిచూడలేక!

అప్పుడే గలగలా రాలిపోయాయి - ఆ కన్నతల్లి కంటినుండి కావలసినన్ని కన్నీళ్ళు!

వీరప్రతాపుని మరణాన్ని మఱచి - సుశీలాదేవి పునర్జన్మను పొంగిపోయిన ఆ పురజనుల బ్రహ్మానందం ఏంచెప్పను!